# ఆడపిల్ల తండ్రి

బల్లా రాధాకృష్ణ శర్మ




ఆనాడు ఆఫీసునుంచి ఆలస్యంగా వచ్చిన రమణమూర్తి 'అమ్మయ్యా' అంటూ పడకకుర్చీలో నడుము వాల్చాడు. హాక్కా పాంటూ విప్పలేదు. చివరికి బూట్లుకూడా విప్పలేదు. ముఖం చూస్తూవుంటేనే బాగా అలిసిపోయిన వానిలా కనిపిస్తున్నాడు. అతను మరి చేస్తున్నది బ్యాంకు ఉద్యోగం. ఏరోజు లెక్కలు ఆరోజే పూర్తిచేసి యింటికి రావాలి. అందులోనూ అది మార్చి ఆఖరివారం!

శివాలయంలో జరుగుతున్న పురాణ కాలక్షేపానికి వెళ్ళడం ఆలస్యమయిందన్న విసుగుని వ్యక్తంచేస్తూ 'ఇదుగోరా వాయనా కాఫీ' అంటూ రమణమూర్తి

తల్లి వేడికాఫీని పడక కుర్చీకి దగ్గరగా ఉన్న చిన్న బల్లమీద పెట్టింది.

'ఉత్తరం వచ్చిందా అమ్మా?'

'ఆ' అని ఒక దీర్ఘం తీసింది తల్లి. గుడికి వెళ్ళడం ఆలస్యమైనందుకు అసహనం ప్రకటిస్తూ, ఉత్తరం తీసుకు వచ్చి ఆమె మూర్తి చేతి కిచ్చింది. 'ఆడ పిల్లట' అంది.

రమణమూర్తిలోని అలసట ఒక్కసారిగా మాయమయింది. అనూహ్యంగా పడక కుర్చీలోంచి లేచికూర్చుని ఉత్తరం చదవ సాగాడు.

'వెడుతున్నారా' అంటూ తల్లి దారి తీసింది శివాలయానికి.

భార్య సుఖంగా పురుడు పోసుకున్నందుకు సంతోషించాడు మూర్తి. తానూ ఒక తండ్రి అయినందుకు గర్వించాడు. నవ జాత శిశువుని చూడాలనే ఉత్కంఠ గూడు కట్టుకుంది.

'ఆడపిల్ల తండ్రిని!' అనుకున్నాడు తనలో తాను. ఉన్నట్టుండి ఏదో భయమూ దిగులూ ఆక్రమించాయి మూర్తి మనస్సుని.

మళ్ళీ పడక కుర్చీలో నడుము వాల్చాడు.

మనస్సు పరిపరి విధాల పోయింది.

తన కుమార్తె జీవితం కమల జీవి తానికి నకలు కాకూడదనుకున్నాడు. భయకంపితుడైనాడు.

కమలపేరుతో పాటు ఆమె విషాద గాథకూడా ఒక్కసారి మూర్తికి స్మరణకు వచ్చింది.

కమల తన ప్రేయసి! ఎంత మంచిదని. అంత అందగత్తె కాదు. కాని మనస్సు! బంగారం లాంటిది. ఆమెకున్న సంపద అంతా మంచితనమే. ఆమెను తొలిసారిగా యూనివర్సిటీ ఆవరణలో చూశాడు. అప్పుడు మూర్తి యం. యస్సి. చదువు తున్నాడు. చూసిన మరుక్షణమే, ఆమెను తప్ప మరెవ్వరినీ పెళ్ళిచేసుకో కూడ దనుకున్నాడు. ఆమెకూడా అలాగే అను కుంది. చివరికి మాత్రం అనుకున్నట్టు జరగలేదు.

ఒకనాడు మూర్తి ధైర్యంచేసి తల్లికి తన కోరికను తెలియజేశాడు. అంతే. ఆమెతోక తొక్కిన తాచులా కనిపించింది,

'ఎంత ధైర్యం వచ్చిందిరా నీకు! మన యింటావంటా వున్నదిట్రా ఇలాంటి ఆచారం! ఆ పిల్ల యెవరో, యేమిటో— ఏమీ తెలుసుకోకుండా పెళ్ళి చేసుకుంటా వుట్రా?'

'చాలా మంచిదమ్మా'

'నిన్ను బుట్టలో వేసుకునేందుకలా మంచిదిగా నటిస్తోందిరా. నువ్వెవట్టి పిచ్చి వాడివి కాకపోతే, ముక్కూ మొగం తెలి యని ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటా వట్రా?'

'నిజంగా చాలా మంచిదమ్మా. నా మాట నమ్మవూ?'

'ఇహనైనా ఆ పిచ్చివేషాలు కట్టి పెట్టు. నీ చదువెప్పుడు పూర్తవుతుందా, ఎప్పుడు పెళ్ళిచేద్దామా అని మీ మామయ్య నీ మీద కొండంత ఆశ పెట్టుకుని కూర్చుంటే, వాడి ఆశని కాస్తా అడి యాస చేస్తావా? పార్వతి నిక్షేపంలాంటి పిల్ల...'

'అని ఎవరు కాదన్నారు?' అన్నాడు మూర్తి.

'అది తెలిస్తేనా, ఎవరో ఆ అమ్మా యిని పెళ్ళి చేసుకుంటానన్నావు, రత్నం లాంటి పిల్లని వదిలిపెట్టి.'

'పార్వతికి నేనేం వంక పెట్టడం లేదమ్మా. తెలివైన పిల్ల. అందమైన పిల్ల. నేనే పార్వతికి తగను.'

'అదేం మాటయిరా? అదేం పరా యిది కనకనా?'

'అది కాదమ్మా. మామయ్య బాగా ఉన్నవాడు. మరి మన సంగతి నేను చెప్పక్కర్లేదు...'

'ఆ దుగ్ధ మామయ్యకు లేనప్పుడు, నీ కెందుకురా అనవసరంగా?'

'నేను కనక పార్వతిని పెళ్ళి చేసు కుంటే, చూసేవాళ్ళంతా ఏమనుకుం టారో తెలుసా?'

'ఏమనుకుంటారేమిటి? ఈడూ జోడూ కుదిరింది. అయిన సంబంధం...'

'కాకిముక్కుకి దొండపండనుకుంటా రమ్మా.'

'మగవాడు ఎలావుంటే యేమిరా? కోడలు నలుపైతే కులమంతా నలు పంటారు గాని...'

'ఏమోనమ్మా, పార్వతికి నేను తగను' మూర్తి అన్నాడు.

'నీ మొహం నువ్వూను ... అంతా నీ యిష్టమనుకున్నావట్రా ... ఆయనే కనక వుంటే, యీ పాటికి పార్వతితో నీకు పెళ్ళి జరిగేది కాదూ...'

ఇక మూర్తి యేమీ మాట్లాడలేక పోయాడు.

తండ్రి తన చిన్నతనంలోనె చనిపో వడం, తనొదిగా తనకోసం తల్లి పడిన పాట్లూ అన్నీ గుర్తుకి వచ్చాయి మూర్తికి. తాను బాగా చదువుకోవాలనీ, పైకిరావా లని ఆశించడమే కాదు, అష్ట కష్టాలు పడింది. మగదిక్కులేని సంసారమే అయినా ఆ లోటు కనిపించకుండా ఎంతో నేర్పుగా సంసారాన్ని దిద్దుకు వచ్చింది. తాను కాలేజీలో ప్రవేశించినప్పుడు డబ్బు తక్కువయితే తన నగలను అమ్మివేసింది. ఆ తర్వాత తనకే విషయంలోనూ ఏటు వంటి లోటూ రానీయలేదు. మరి అటు వంటి తల్లిమాటను యిప్పుడు కాదన డమా అనుకున్నాడు మూర్తి.

ఆ తర్వాత కమల విషయాన్ని తల్లి యెదుట ప్రస్తావించలేదు రమణమూర్తి. కాని కమలను మోసం చేశానని అప్పు డప్పుడు బాధ పడేవాడు.

తల్లి అనుకున్నట్టుగా పార్వతీ రమణ మూర్తుల వివాహం వైభవోపేతంగా జరి గింది. పెళ్ళినాడుగూడా మూర్తి మన స్సులో కమల మెదలకపోలేదు. రోజులు గడవను గడవను ఆమెను క్రమక్రమంగా మరచిపోయాడు, దైనందిన జీవిత యాత్రలో పడిపోయి.

ఒకనాటి దినపత్రికలో పిడుగువంటి వార్తను చూశాడు మూర్తి. 'చెరువులో యువతి శవం' ఇటువంటి వార్తలు పత్రికా పాఠకులకు కొత్తకాదు. కాని ఆ విషయాన్ని పూర్తిగా చదవా లనిపించింది మూర్తికి. చదివాడు. కంట తడిపెట్టాడు. గుండె ఆగిపోయినట్లనిపించింది. పరి సరాలన్నీ చీకటిముద్దలా కనిపించాయి. ఎక్కడా వెలుగురేఖ ఒక్కటైనా కని పించలేదు.

కొంతసేపటికి తేరుకున్నాడు. ఆ వార్తను మననం చేసుకోసాగాడు మూర్తి. 'చెరువులో శవం... పేరు... కమల... చదువు కున్నది...'

# ఆడపిల్ల తండ్రిని

తల్లి వద్దంటున్నా మూర్తి ఆ సాయంకాలం కమలవాళ్ళ ఊరికివెళ్ళాడు. కమల తండ్రిని కలుసుకున్నాడు. తాను రమణమూర్తిననీ, కమల స్నేహితుడననీ చెప్పుకున్నాడు.

'ఛీ, దుర్మార్గుడా! నీ వల్లనె నా కూతురు చచ్చిపోయింది. ఎందుకొచ్చావ్ యిక్కడికి!' అని గర్జించాడు కమల తండ్రి.

మూర్తి నిలువునా నీరయి పోయాడు. తనవల్ల కమలకు నూరేళ్ళా నిండాయి!

'నేనేం పాపమూ ఎరగనండి. నామాట నమ్మండి.' దీనాతి దీనుడై చెప్పాడు.

'నువ్వు కమలను ప్రేమించావా?'

'అవునండి.'

'పెళ్ళి చేసుకుంటానని చెప్పావా?'

'అలా కమలతో అనలేదు కానీండి, పెళ్ళి చేసుకోవా లనుకున్నాను.'

'మరి ఎందుకు చేసుకోలేదు,?'

'మా అమ్మ ఒప్పుకోలేదు.'

'అయితే నాతో ఎందుకు చెప్పలేదు?'

'చెప్పే ధైర్యం చాలక...'

కమలతండ్రి యేమీ మాట్లాడలేదు.

'నామాట నమ్మండి నేనేం పాపమూ యెరుగను' అన్నాడు రమణమూర్తి.

అంతవరకూ రెండవ రుద్రునిలా కనిపించిన కమల తండ్రి కళ్ళనీళ్ళు గుక్కుకుంటూ 'ఇప్పుడు ఎవర్నని యేం లాభం? నాయనా అంతా అయిపోయింది. నా కూతురు దక్కలేదు. అంతే' అన్నాడు.

రమణమూర్తి మనస్సు వెయ్యి వ్రక్కలయింది. పొంగివస్తున్న దుఃఖాన్ని అణచుకోలేక పోయాడు. కళ్ళు నీటి బుంగలయినాయి.

'కమలకూడా నీలా ఏ పాపమూ ఎరగనంది. నీచేత ఆ సంగతి చెప్పిస్తానంది. కాని ఆత్రాష్ఠుడు నమ్ముతేనా? నాతల్లి మీద నాకు నమ్మకం ఉంది...'

రమణమూర్తి కళ్ళనుంచి నీటిబొట్లు కింద రాలుతూనే వున్నాయి.

ఆ తర్వాత మరికొన్ని వివరాలు తెలుసుకున్నాడు మూర్తి.

ఒకరోజు కమల ఏదో ఒక పుస్తకం చదువుతూ వుండగా అప్పుడు ఆమె భర్త ఆమెదగ్గరకు వచ్చాడనీ, ఆ పుస్తకంలో ఒకచోట రమణమూర్తి సంతకం కనిపించిందనీ, అది యెవరిదని అడగ్గా అది తన స్నేహితునిదని కమల చెప్పిందనీ ఆ తర్వాత వాళ్ళిద్దరి మధ్యా వాగ్వాదం సాగిందని కమల తండ్రి చెప్పలేక చెప్పాడు.

కమల తాను నిర్దోషిననీ, తన శీలాన్ని శంకించవద్దని భర్తను కాళ్ళావేళ్ళా పడి వేడుకుంది. కాని అతడు మాత్రం తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని కూర్చున్నాడు. కటూక్తులాడి కమల మనస్సుని గాయపరిచాడు. ఇక అటువంటి భర్తతో కాపురం చెయ్యడం కంటె ప్రాణత్యాగం మంచిదనుకుంది. చెరువులో పడి ప్రాణాలు విడిచింది.

కమల విషాదగాథనంతా విని కన్నీరు మున్నీరుగా విలపించాడు రమణమూర్తి. తనవల్లనే ఒక నిండు ప్రాణం బలిఅయిందనుకున్నాడు.

పడక కుర్చీలోంచి మెల్లగా లేచి కూర్చున్నాడు మూర్తి.

పురాణానికి వెళ్ళిన తల్లి అప్పుడే లోపలికి అడుగు పెడుతోంది.

మూర్తి కళ్ళు తుడుచుకున్నాడు. పడక కుర్చీలోంచి లేవబోతూ వుండగా తల్లి దగ్గరికి వచ్చింది.

'కాఫీకూడా తాగకుండా, ఇంతసేపటినుంచీ ఏం చేస్తున్నావురా నువ్వు?' అని అడిగింది.

మూర్తి మాట్లాడలేదు.

'ఆడపిల్ల తండ్రివవ్వావని అప్పుడే దిగులు పడుతున్నావా యేమిటి?'

'లేదమ్మా, సంతోషిస్తున్నాను.'

'ఇప్పుడు సంతోషంగానే వుంటుంది..'

'ఇప్పుడే కాదమ్మా, ఎప్పుడూ సంతోషంగానే వుంటాను. చచ్చిపోయిన కమల మళ్ళీ బతికింది.' అన్నాడు రమణమూర్తి గంభీరంగా. అతని కళ్ళల్లో ఒక క్రొత్త వెలుగు కనిపించింది. ●

